



తిరుపతి సచివాలయం ఎదుట

విద్యుత్ బిల్లులు దగ్ధం చేస్తూ...

సిపిఎం వినూత్న నిరసన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, సర్దుబాటు చార్జీల భారాలను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం తిరుపతిలోని 44వ డివిజన్ సచివాలయం వద్ద విద్యుత్ బిల్లులను దగ్ధం చేస్తూ సిపిఎం నేతలు వినూత్నంగా నిరసన తెలియజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తూ ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి భారాలను వేశారని, అదనంగా ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై మోయలేని భారాలు వేయడం అన్యాయమన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా చక్కెర, పామాయిల్ సరుకులను ఇవ్వాలన్నారు. 400 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని, సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని, పెంచిన ఆస్తి పన్నును, చెత్త పన్ను రద్దు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న గ్రూప్ 1 గ్రూప్ 2 పోస్టులు భర్తీ చేయాలని అన్నారు. ప్రజలపై భారాలు వేస్తున్న బిజెపి నిరంకుశ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 4వ తేదీన మండల స్థాయి ధర్నాలు చేపడుతున్నట్లు తెలిపారు. కొర్లగుంట, సుందరయ్య నగర్, సప్తగిరి నగర్, జీవకోన, ప్రాంతాలలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు టి సుబ్రమణ్యం, ఎస్ జయచంద్ర, పి సాయి లక్ష్మి, ఏం జయంతి, పి హేమలత, పి. బుజ్జి, టి రాధా, కే వేణుగోపాల్, ఎం నరేంద్ర, పి చిన్న, ఎండి శ్రీను, ఆర్ మల్లికార్జున రావు పాల్గొన్నారు.

సత్యవేడులో.. ప్రజలను పట్టి పీడిస్తున్న అధిక ధరలను తగ్గించాలని సచివాలయాల వద్ద వినతిపత్రం సమర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ రోజురోజుకూ నిత్యవసర ధరలు అదుపు లేకుండా ఆకాశాన్నంటుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలరెడ్డి, మురళి పాల్గొన్నారు.


శ్రీకాళహస్తిలో... 9వ వార్డు సచివాలయం వద్ద నిరసన తెలిపారు. నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, కుమార్, రాజా, వెలివేంద్రం పాల్గొన్నారు.

రేణిగుంటలో... సచివాలయం వద్ద విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. నిరుద్యోగులకు ఉపాధి చూపాలని, రేణిగుంట పేదలకు ఇచ్చిన జగనన్న పట్టాలకు ఇంటి స్థలాలు చూపాలని డిమాండ్ చేశారు. దోమల నివారణా చర్యలు చేపట్టాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. వినాయకనగర్, బిస్మిల్లానగర్, వివేకానందకాలనీ, బుగ్గవీధి, పాంచాలినగర్ ప్రాంతాల్లో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నాలు జరిగాయి. రేణిగుంట పంచాయతీ కార్యాలయం వద్ద విద్యుత్ బిల్లులను దహనం చేశారు. అనంతరం సర్పంచి నగేష్‌కు, సచివాలయ సిబ్బందికి సంతకాలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె. హరినాథ్, ఒ. వెంకటరమణ, ఎంపిటిసి ఎన్. రాజేశ్వరి పాల్గొన్నారు.

గూడూరు టౌన్‌లో... రోడ్లు, డ్రైనేజీలు దెబ్బతిన్నాయని, వీధిలైట్లు సరిగ్గా వెలగడం లేదని సిపిఎం ఆధ్వర్యంలో సచివాలయ సెక్రటరీలకు వినతిపత్రాలను అందించారు. జోగి శివకుమార్, సురేష్, గోపినాధ్, పెంచల్ ప్రసాద్, బి. చంద్రయ్య, అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.



రేణిగుంటలో..



గూడూరులో..




తిరుపతిలో 9 నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ

రాష్ట్రప్రభుత్వం ఇటీవల ఈస్టాంపింగ్ విధానాన్ని తీసుకువచ్చింది. బ్రిటిషుకాలం నుంచి వాడుకలో ఉన్న రూ 10, 20, 50, 100 విలువ చేసే నాన్-జ్యూడిషియల్ స్టాంపు పత్రాల స్థానంలో ఈస్టాంపు విధానం అమల్లోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నాన్‌జ్యూడిషియల్ స్టాంపు పేపర్లు చాల తక్కువ మొత్తంలో ఉన్నాయి. తర్వలో వీటి విక్రయాలు పూర్తిగా ఆపివేయనున్నారు. ప్రసుత్తం ఆన్‌లైన్ వాధానంలో డాక్యుమెంట్‌కుస్టాంపు అవసరం లేకుండపోయింది. దీంతో డాక్యుమెంట్ రైటర్లు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసనలు తెలుపుతున్నారు.

రిజిస్ట్రేషన్... ఫ్రస్టేషన్..!

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ ప్రక్రియతో లబ్ధిదారుల్లో ఫ్రస్టేషన్ మొదలయ్యింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వల్ల తమ ఆస్తులకు ఎక్కడ ఇబ్బందులు కలుగుతాయోనన్న భయం నెలకొంది. తిరుపతి బాలాజీ జిల్లా రిజిస్ట్రేషన్ పరిధిలో ఉన్న అన్ని కార్యాలయాలు శుక్రవారం వెలవెలబోయాయి. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ అర్ధంకాకపోవడమే ప్రధాన కారణం. రోజుకు సుమారు 600 నుంచి 800 రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. శుక్రవారం కేవలం బాలాజీ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయల్లో 50లోపే జరిగాయి. ఈనెల 9తేది నుంచి తిరుపతి బాలాజీ జిల్లా రిజిస్ట్రేషన్ పరిధిలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేయనున్నట్లు జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఈనెల 15తేది నుంచి విస్తృతంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయడం అందుబాటులో వస్తుందన్నారు. ప్రజలు వీటికి అలవాటు పడలన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వల్ల ప్రజలు వారి ఆస్తులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఆన్‌లైన్ వల్ల దళారులను నిర్మూలించవచ్చన్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం కార్డ్‌ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌ను ఇప్పటికే రూపొందించి. ఈసాఫ్ట్‌వేర్‌ను రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ అనుసంధానం చేశారు. భవిష్యత్‌లో చోటు చేసుకునే లోపాలు, అనేక ఇబ్బందులను గుర్తించిన తర్వాత ఈసాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకుంటూ వెళతారు.



రిజిస్ట్రార్

దరఖాస్తుదారే నేరుగా...

దరఖాస్తుదారులే స్వయంగా డాక్యుమెంట్‌ను రూపొందించుకోవాల్సి ఉంటుంది. దీని కోసం రిజిస్ట్రేషన్లు శాఖ వెబ్‌సైట్‌కు వెళ్లి దరాఖాస్తు చేసుకోవడానికి లాగిన్ కావాల్సి ఉంటుంది. అందులో ఏరకమైన డీడ్ రాయించుకోవాల్సి ఉంటుందో, దానికి సంబందించిన ఫార్మాట్‌ను ఎంపిక చేసుకుని, ఆ వివరాలు నమోదు చేసి దానికి సబ్ రిజిస్ట్రేర్ లింక్ రూపంలో పంపించాల్సి ఉంటుంది. సబ్ రిజిస్ట్రార్ దానిని పరిశీలించిన తర్వాత ఏవైనా సవరించాల్సినవి ఉంటే తిరిగి దరఖాస్తుదారునికి మెయిల్ ద్వారా లింక్ పంపుతారు. వాటిని కూడా సరిచేసిన లింక్ ద్వారానే మళ్లి సబ్ రిజిస్ట్రార్‌కు పంపితే దానికి ఆయన ఓకే చేసిన తర్వాత పార్టీలు ఇద్దరు థంబ్ (వేలిముద్ర) వేస్తే సరిపోతుంది.. థంబ్ కోసం బయోమెట్రిక్ డివైజ్‌ను ఉపయోగించుకోవచ్చు. లేదా రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయానికి వెళ్లి థంబ్ వేయాల్సి ఉంటుంది. సంతకాలతో సంబంధం లేనందున ఆతర్వాత సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్‌ను పీడిఎఫ్ రూపంలో దరఖాస్తుదారుని మెయిల్‌కు పంపిస్తారు.



శుక్రవారం తిరుపతి కార్యాలయాలు వెలవెల

నూతన విధానం అనుమానాలు ఎక్కువ

ఈ నూతన విధానంపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ డాక్యుమెంట్ రూపకల్పనపై ఆన్‌లైన్ సంస్కరణలు తీసుకురావాలన్న ప్రయత్నాలు గత ప్రభుత్వాల నుంచి జరుగుతున్నాయి. గతంలో రవాణాశాఖలో ఆన్‌లైన్ సేవలను తీసుకొచ్చినపుడు నూరుశాతం కష్టంగా ఉందని భావించారు. ఆతర్వాత అందులో సాంకేతిక లోపాలను దృష్టిలో ఉంచుకుని భారీగా ఆర్థిక మోసానికి పాల్పడ్డారు. దీంతో రవాణశాఖకు రావాల్సిన ఆదాయం రాలేదు. తాజాగా డాక్యుమెంట్ విధానాన్నే సమూలంగా మార్చివేసే ప్రక్రియంతా నిఖార్సుగా జరుగుతుందనటానికి వీలులేదు. ప్రసుత్తం మనం చూస్తున్న స్టాంప్ పేపర్లతో కూడిన డాక్యుమెంట్లు ఇక కనిపంచవు. ప్రజలు డాక్యుమెంట్లు మాన్యువల్ స్టాంప్‌పేపర్లు మీద ఉండాలనుకుంటారు. అలాగే డాక్యుమెంట్ రైటర్ ద్వారా రూపొందించే డాక్యుమెంట్‌లలో ఆస్తి తమకు ఎలా వచిందన్న స్వభావం సమగ్రంగా ఉంటుంది. ఆన్‌లైన్ డాక్యుమెంట్‌లో అమ్మినవ్యక్తి, కొన్న వ్యక్తి వివరాలు, విస్తీర్ణం, సర్వేనెంబర్, హద్దులు వంటివి మాత్రమే ఉంటాయి. స్వభావం, ఆస్తి మూలాలకు సంబంధించిన వివరాలను పొందుపరిచే ఫార్మెట్ లేకపోవడం వల్ల కూడా ప్రజలు నూతన విధానం పట్ల సుముఖంగా కనిపించడం లేదు. ఏదిఏమైనా మోసాలకు ఆస్కారంగా ఉంటుందన్న అనుమానం దరఖాస్తుదారుల్లో ఉంది.



ఓటర్ జాబితా క్షేత్రస్థాయిలో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తిరుపతి నియోజకవర్గం లోని పలు పోలింగ్ బూత్‌ల పరిధిలో తొలగించబడిన ఓటర్ జాబితాను క్షేత్ర స్థాయిలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె వెంకట రమణారెడ్డి, తిరుపతి ఈఆర్ఓ హరిత తో కలిసి తనిఖీ చేసారు. శుక్రవారం ఉదయం తిరుపతి నియోజక వర్గంలో మారుతీ నగర్ రాయల్ నగర్ లోని 251, 252, 253, బైరాగి పట్టెడ 148 తదితర పోలింగ్ బూత్ ల పరిధిలోని గహాలను జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా సందర్శించి ఓటర్ జాబితా నుండి తొలగించబడిన వారి వివరాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అర్బన్ వెంకట రమణ, ఎలక్షన్ డి.టి జీవన్ పాల్గొన్నారు. చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాలెంలో గడప గడపకూ వెళ్లి పరిశీలించారు.

యోగా పిజి డిప్లమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి డిప్లమా ఇన్ యోగ పీజీ డిప్లమో ఇన్ యోగ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వ్యాయామవిద్య విభాగం విభాగాధిపతి ఆచార్య జి. సారాసరోజిని ఒక ప్రకటనలో తెలిపారు. పై కోర్సులకు ప్రాస్పెక్టస్ కం దరఖాస్తు ఫారాలను యూనివర్సిటీ వ్యాయామ విద్యా విభాగం నందు 1 సెప్టెంబర్, 2023 నుండి 30 వరకు పొందవచ్చును అన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను 30 సెప్టెంబర్ 2023 సాయంత్రం 5 గంటల లోపు ఇవ్వాలన్నారు.

ఓపెన్ వర్సిటీ డిగ్రీ అడ్మిషన్లకు గడువు పొడిగింపు

పుత్తూరు టౌన్ : పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ కు 20 తేది వరకు గడువు పొడిగించామని, అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని కళాశాల కోఆర్డినేటర్ టి. నరసింహులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పాసైనవారు, ఓపెన్ ఇంటర్మీడియట్ పాసైనవారు, ఐటిఐ రెండేళ్ల కోర్సు పాసైనవారు, ఎన్ఐఒఎస్ పాసైనవారు, డిప్లొమా పాసైనవారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు 9515401088.7382929641 సంప్రదించాలని కోరారు.

వేరుశనగకు 'క్రాప్ హాలిడే'

వర్షాభావంతో తగ్గిన సాగు
47 శాతం తగ్గిన విస్తీర్ణం
'సజ్జ' సాగు చేయని రైతులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఖరీఫ్ నిండా ముంచింది.. జులై, ఆగస్టులో పడాల్సిన వర్షాలు మొహం చాటేశాయి. ఆగస్టులో అడపాదడపా పడినా అదునుకు సరిపోని పరిస్థితి. ఆగస్టులో మామూలుగా పడాల్సిన వర్షం కంటే -5 శాతంగా నమోదయ్యింది. జిల్లాలో 34 మండలాల్లో 22 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితి నెలకొంది. బాలాయపల్లి, కోట, వాకాడు, చిట్టమూరు, తడ, తొట్టంబేడు, పెళ్లకూరు, దొరవారిసత్రం, ఓజిలి మండలాల్లో పడాల్సిన వర్షం కంటే 55-65 శాతం తక్కువగా నమోదయ్యింది. జిల్లాలో వేరుశనగ విస్తీర్ణం 47శాతం తగ్గిందని, సజ్జ 43 శాతం తగ్గిందని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు 'ప్రజాశక్తి'కి తెలిపారు. అయితే వరి 'బోరు' ఆధారితం కావడంతో వందశాతం నాట్లు వేశారని చెప్పారు. శనగ మొత్తం 16వేల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటివరకూ 7,420 ఎకరాల్లో మాత్రమే సాగయ్యింది.



వరి 57వేల 670 ఎకరాల్లో సాగు చేసి నూటికి నూరు శాతం పంట వేశారు. సజ్జ కేవలం మూడు వేల ఎకరాల్లో మాత్రమే సాగయ్యింది.

జూన్‌లో 72.8 వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 45.4శాతంగా నమోదయ్యింది. జులైలో 103.2శాతం పడాల్సి ఉండగా సగానికి సగం 52.2శాతానికి పడిపోయింది. ఆగస్టులో ఇప్పటివరకూ 114శాతం పడాల్సి ఉండగా 109 శాతమే పడింది. దీంతో -5శాతంగా వర్షాభావం ఉంది. అయితే ఆగస్టు నెలలో ఎండలూ ఎక్కువగానే నమోదయ్యాయి. వరుసగా ఆగస్టులో ఆరు రోజుల పాటు 35-39 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సెప్టెంబర్‌లో కురిసే వర్షాలపైనే రైతులు ఆధారపడి ఉన్నారు. పశ్చిమ మండలాల్లో వర్షాభావ పరిస్థితుల రీత్యా తూర్పు ప్రాంతం నుంచే 500 ట్రాక్టర్లకు పైగా పశువుల దాణాను తరలించినట్లు అధికారి తెలిపారు. సెప్టెంబర్ పూర్తయితే గాని జిల్లా కరువు పరిస్థితిని అంచనా వేయలేమని చెప్పారు. వాస్తవానికి జులైలో వర్షాభావం భారీగా నెలకొనడంతో విత్తిన వేరుశనగ ఎండిపోయిందని, ఈ ప్రభావం దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతన్నలు వాపోతున్నారు.

22న గరుడ సేవ రోజు 'నిమజ్జనాలు' వద్దు

టీటీడీ సంపూర్ణ సహకారం : భూమన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి నగరంలో ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగే వినాయక నిమజ్జన కార్యక్రమానికి టీటీడీ సంపూర్ణ సహకారం అందిస్తుందని ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి చెప్పారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో గరుడ సేవ జరిగే సెప్టెంబరు 22వ తేదీ వినాయక నిమజ్జనాలు జరగకుండా వినాయక నిమజ్జన కమిటీ ప్రతినిధులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం కరుణాకర రెడ్డి నగరపాలక సంస్థ, టీటీడీ , ఇతర శాఖల అధికారులు, నిమజ్జన కమిటీతో సమావేశం జరిపారు. కరుణాకర రెడ్డి మాట్లాడుతూ వినాయక నిమజ్జనం ప్రశాంతంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగేందుకు గత ఏడాది లాగే ఈ సారీ టీటీడీ వైపు నుండి అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. వినాయక సాగర్ వద్ద భక్తులందరికీ తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కుంకుమ, కంకణాలు అందిస్తామని చెప్పారు. తిరుమలలో స్వామి వారి గరుడ సేవ జరిగే రోజునే వినాయక విగ్రహాల ఐదవ రోజు నిమజ్జనం వస్తోందన్నారు. తిరుమలకు గత ఏడాది కంటే ఎక్కువ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు .

మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, ఉప మేయర్ ముద్ర నారాయణ, ఆర్డీవో కనక నరసారెడ్డి, టీటీడీ ఎస్ఈ సత్యనారాయణ, అదనపు ఎస్పీ కులశేఖర్ తో పాటు వివిధ శాఖల అధికారులు, నిమజ్జన కమిటీ ప్రతినిధులు సామంచి శ్రీనివాస్, ఆర్సీ మునికష్ణ, మాంగాటి గోపాలరెడ్డి, గుండాల గోపినాథ్ పాల్గొన్నారు.

సేవాభావంతో వైద్యసేవలు అందించాలి : టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

అదృష్టం ఉంటే తప్ప వైద్య వృత్తిలోకి రాలేరని, సేవాభావంతో వైద్యసేవలు అందించాలని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హితబోధ చేశారు. శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థకు అనుబంధంగా ఉన్న శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ 2023-24 విద్యా సంవత్సరానికి (10వ బ్యాచ్) అడ్మిషన్ పొందిన విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో కనీసం మందులు కొనలేని నిరుపేదలు ఉన్నారని, అలాంటి వారికి వైద్య వృత్తిలోకి ప్రవేశించిన తరువాత సేవాభావంతో వైద్యసేవలు అందించాలని ఉద్భోదించారు. సమాజసేవ, వ్యక్తిగత జీవనంలో మార్పు కలబోసిన జీవితమే వైద్యవిద్యని అన్నారు. చదువును ధనార్జనే ధ్యేయంగా కాకుండా సమాజ సేవకు, పేదల కోసం వినియోగించుకోవాలని కోరారు. స్విమ్స్ సంచాలకులు ఆర్‌వి కుమార్ మాట్లాడుతూ స్విమ్స్‌ను ర్యాగింగ్ ఫ్రీ జోన్‌గా పేర్కొన్నారు. విద్యార్థులు విద్యపై మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసంపై దృష్టిని కేంద్రీకరించాలన్నారు. శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. ఉపాకళావత్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరానికి 175 సీట్లకు గానున ప్రస్తుతం 152 మంది విద్యార్థినులు అడ్మిషన్లు పొందారని తెలిపారు. అడ్మిషన్ పొందిన విద్యార్థినీలకు టిటిడి ఛైర్మన్ చేతుల మీదుగా ఎఫ్రాన్స్ (అప్రన్)ను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ బిట్ల, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ముక్తేశ్వరయ్య. డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

తరగతుల ప్రారంభం

ఏస్ వి వైద్య కళాశాలలో సెప్టెంబర్ 1 నుండి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ 2023- 24 సంవత్సరానికి గాను ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు నేషనల్ మెడికల్ కమిషన్ న్యూఢిల్లీ వారి ఆదేశాల మేరకు, డాక్టర్ వైయస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వారి సూచనలతో సెప్టెంబర్ ఒకటో తేదీ నుండి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు క్రమం తప్పకుండా ఓరియంటేషన్ క్లాసెస్ ను నడిపించాలన్నారు. మొదటి సంవత్సరంలోని అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, సామాజిక వైద్య విద్య విభాగాల వారితో ఓరియంటేషన్ తరగతులను నిర్వహించడానికి విభాగ అధిపతులు , వైద్య అధ్యాపకులు రోజువారి టైం టేబుల్ ప్రకారము వారికి ఈ తరగతులను నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధవి లత, డాక్టర్ మురళీధర్, డాక్టర్ ఫహీమ్ పాల్గొన్నారు.





బియ్యం బస్తాలు మోస్తూ... 'చదువులు'

ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ

బడుగు బలహీన వర్గాల విద్యార్థులంటే అందరికీ చులకనే.. చదువుకోవాలన్న ఆశతో ఇల్లు గడవని పరిస్థితుల్లో హాస్టల్లో చేరిన విద్యార్థులు 'కూలి' పనులు చేయాల్సిందే. మండలంలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులు బియ్యం బస్తాలు మోస్తూ 'మీడియా'కు చిక్కారు. వార్డెన్ చెబితే చేయాల్సిందేనని, లేదంటే కసురుకుంటారని విద్యార్థులు వాపోతున్నారు. విద్యార్థుల చేత కూలి పనులు చేయించుకోవడం ఏంటని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి ఆవేదన వ్యక్తం చేశారు. స్కూలు జరిగే సమయంలో విద్యార్థులతో బియ్యం బస్తాలు ఎలా మోయిస్తారని ప్రశ్నించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, విద్యార్థులతో పనులు చేయిస్తూ, సక్రమంగా భోజనం పెట్టని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



సుందరీకరణ పనులు వేగవంతం : కమిషనర్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

నగరపాలక సంస్థ పరిధిలోని ముత్యాల రెడ్డి పల్లి కూడలిలో జరుగుతున్న సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ హరిత ఆదేశించారు. ఈ పనులను శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దండి మార్చ్ విగ్రహాలు ఏర్పాటు చేసినా సుందరీకరణ పనులు ఎందుకు ఆలస్యం చేస్తున్నారని అన్నారు. దండి మార్చ్ చుట్టూ పూల మొక్కలు ఎక్కువగా నాటాలని, లాన్ కూడా ఏర్పాటు చేయాలని అన్నారు. మార్బుల్స్ కూడా ఒకే రంగులో చూపరులను ఆకర్షించేలా ఏర్పాటు చేయాలని, పనుల్లో నాణ్యత పాటించాలన్నారు.

నేడు తెలుగు గంగ నీటికి అంతరాయం : కమిషనర్

తిరుపతి టౌన్ : నగరానికి నీటి సరఫరా చేయు తెలుగు గంగ నీటి పంపిణీ శనివారం మరమ్మత్తుల కోసం అంతరాయం కలుగుతుందని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు గంగ హెడ్ వాటర్ వర్క్స్ మెయింటెనెన్సు చేయుటలో భాగంగా యం.డి.పుత్తూరు పంపింగ్ స్టేషన్ నందు క్రొత్త పంప్ అమరుస్తారని, గురవరాజు పల్లి దగ్గర, అనాసంపల్లి దగ్గర పంపింగ్ మెయిన్ పైపు నీరు లీకజి అరికట్టు పనిని చేపట్టుచున్నందున తిరుపతి నగర ప్రజలకు 2వ తేది శనివారం నీటి సరఫరాకు అంతరాయము కలుగునని తెలిపారు. ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా అత్యవసరమయిన వార్డులలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.

'ఆదిత్య ఎల్1'పై ఆసక్తి

నేడు 11.50 గంటలకు ప్రయోగం చెంగాళమ్మ ఆలయంలో పూజలు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

శనివారం ప్రయోగించనున్న ఆదిత్య ఎల్1 ప్రయోగం పై దేశంలో ఆసక్తి పెరిగింది. ఇటీవల చంద్రయాన్-3 ప్రయోగం సరికొత్త చరిత్ర సష్టించడంతో సూర్యడిపై పరిశోధనల కోసం ప్రయోగిస్తున్న ఆదిత్య ఎల్ 1 ఎప్పుడెప్పుడా అని దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 11.50 గంటలకు జరుగునున్న పిఎస్ఎల్వి సి-57 రాకెట్ ద్వారా ఆదిత్య ఎల్ 1 ప్రయోగించనున్నారు. ఆ సమయంలో పీఎస్ఎల్వీ సి-57 ప్రయోగ వీక్షణ కోసం అప్పుడే ఆన్లైన్ దరఖాస్తులు వెల్లువెత్తు తున్నాయి. చంద్రయాన్-3 అంచెలంచెలగా దాటుకొని 3 లక్షల 80 వేల కిలోమీటర్లు చేరేందుకు 41 రోజుల సమయం పట్టింది. ఇది ప్రస్తుతం సుమారు నాలుగింతల ప్రయాణం ఎక్కువ చేయాల్సి ఉంది. ఈ ఆదిత్య ఎల్1లో 7 ఉపకరణాలను సూర్య పరిశోధనల కోసం పంపిస్తున్నారు.వాటిని ఇప్పటికే రాకెట్ శీర్ష భాగంలో ఉన్న ఆదిత్య ఎల్ 1లో అమర్చి ఉన్నారు. అమెరికా,జపాన్, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ, చైనాల తర్వాత సూర్య పరిశోధనల కోసం ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్న 5వ దేశం మనది. సూర్యగోళం నుంచి ప్రసరించే అత్యంత శక్తివంతమైన కాంతి ప్రభావాన్ని అధ్యాయం చేసేందుకు వీలుగా ఆదిత్య ఎల్1లో అమర్చిన ఏడు పేలోడ్లు పనితీరు ప్రదర్శించాల్సి ఉంది.ఇందులో నాలుగు పేలోడ్లు నేరుగా సూర్యుడిని అధ్యయనం చేస్తే, మిగతా మూడు పేలోడ్లు సమీపంలోని సౌర రుణువులు, అయస్కాంత క్షేత్రాల గురించి శోదిస్తాయి. శ్రీహరికోటలో ప్రస్తుతం ఆదిత్య ఎల్ 1 ప్రయోగంపై ఇస్రో శాస్త్రవేత్తలు పూర్తి దష్టి కేంద్రీకరించారు.

చెంగాళమ్మను దర్శించిన ఇస్రో చైర్మన్

తిరుపతి జిల్లా లోని సూళ్లూరుపేటలో వెలసి ఉన్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయాన్ని ఇస్రో చైర్మన్ సోమనాథ్ శుక్రవారం దర్శించుకుని పూజలు చేశారు. అమ్మణ్ణి ఆశీస్సులతో చంద్రయాన్-3 విజయవంతం కావడం పట్ల అమ్మణ్ణికి పూజలు చేయడంతో పాటు



శనివారం జరిగే ఆదిత్య ఎల్1 మిషన్ ప్రయోగం విజయవంతం కావాలని కోరుకుంటూ ఇస్రో చైర్మన్ సోమనాద్ అమ్మణ్ణికి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ఈవో ఆళ్ళ శ్రీనివాసులు రెడ్డి స్వాగతం పలికారు. ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ సూర్యుని పై అధ్యయనం చేయడం కోసం శనివారం ఉదయం 11:50 నిమిషాలకు ఆదిత్య - ఎల్1 మిషన్ ను ప్రయోగిస్తున్నట్లు తెలిపారు. ఆదిత్య మిషన్ ప్రయాణం 125 రోజులు ఉంటుందని, సూర్యునికి సమీపంలోకి చేరుకున్నాక అక్కడ జరిగే వాతావరణ మార్పులను, ఉష్ణోగ్రత మార్పులపై పరిశోధనలు చేయడం జరుగుతుందని తెలిపారు. వచ్చే నెలలో గగన్ యాన్ పరిశోధాత్మక ప్రయోగం ఉంటుందని తెలియజేసారు. చైర్మన్ తో పాటు షార్ డైరెక్టర్ రాజరాజన్ ఆర్ముగం,గ్రూప్ డైరెక్టర్ గోపినాధ్ ఉన్నారు.



రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

గూడూరు టౌన్ : చిట్టమురు మండల పరిధిలోని మల్లం గ్రామంలో ఆదివారం వైస్సార్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బత్తిని విజయ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని వైస్సార్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం గోడ పత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా బత్తిని విజయ కుమార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తమ ట్రస్ట్ ద్వారా పలు సేవాకార్యక్రమలు నిర్వహించామన్నారు.



ఆధునీకరించిన ఐసియు, సెమినార్ హాల్ ప్రారంభం

తిరుపతి సిటీ : స్విమ్స్ హాస్పిటల్ అధునీకరించిన కార్డియాలజీ ఐ.సి.యు, సెమినార్ హాల్ ను డైరెక్టర్ ఆర్ వి కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టి.టి.డి ఈ.ఓ ఏ. వి. ధర్మారెడ్డి కార్డియాలజీ విభాగాన్ని సందర్శించి కార్డియాలజీ విభాగాన్ని ఆదినీకరించలని ఆదేశాలు జారి చేశారు. అందుకు అనుగుణంగా టి. టి. డి వారు కార్డియాలజీ ఐసీయూ విభాగాన్ని 22 లక్షలు వ్యయంతో ఆధునీక రించారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్. అల్లాడి మోహన్, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్. రాజశేఖర్, మెడికల్ సూపరింటండెంట్ డాక్టర్.రామ్ పాల్గొన్నారు.

4న పారామెడికల్ రెండో విడత కౌన్సిలింగ్

తిరుపతి సిటీ : శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజ్ లో 2023వ సంవత్సరపు విద్యాసంవత్సరం పారామెడికల్ కోర్సుల్లో మిగులు సీట్లకు రెండో విడత కౌన్సిలింగ్ సోమవారం జరుగుతుందని ప్రిన్సిపల్ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు కళాశాల వెబ్సైట్ ను సంప్రదించాలని సూచించారు.

మృతుని కుటుంబీకులకు నగదు అందజేత

రేణిగుంట : రేణిగుంట మండలంలోని తారకరామా నగర్ కు చెందిన ప్రముఖ సంఘ సేవకురాలు లోకేశ్వరి సేముఱ అభినందనీయమని తారకరామ నగర్ ప్రజలు కొనియాడుతున్నారు. అనాధలు నిరుపేదలు మతి చెందితే వారికి అండగా నిలుస్తూ తన వంతు సాయంగా దనక్రియలకు లోకేశ్వరి నగదును అందిస్తున్నారు. తారకరామ నగర్ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న సిరాజమ్మ భర్త ఆకస్మిక మతి చెందడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి లోకేశ్వరి అండగా నిలిచి ఐదువేల రూపాయలు నగదును అందజేశారు. లోకేశ్వరి చేస్తున్న సేవలను తారకరామ నగర్ ప్రజలు ప్రశంసిస్తున్నారు.

శాస్త్ర విరుద్ధమైన నిర్మాణాలు ఆపండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రముఖ శైవ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీజ్ఞానప్రసూనాంబికా దేవి సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో ఇటీవల కాలంలో జరుగుతున్న శాస్త్ర విరుద్ధమైన నిర్మాణాలను ఆపాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. రాతి శిలలను ఉపయోగించాల్సిన స్థానంలో రసాయనాలు, బూడిద మిశ్రమంతో తయారు చేసిన సిమెంట్ రాళ్ళతో నిర్మాణం చేపట్టడం అన్యాయమన్నారు. ఇంజినీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతున్న నిర్మాణాలకు సిమెంట్ రాళ్ళు వినియోగిస్తుండటం శివ భక్తుల మనోభావాలను, విశ్వాసాలను తీవ్రంగా గాయపరుస్తున్నదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మిన్నల్ రవి, కాసరం రమేష్, వజ్రం కిషోర్, మునిరాజా యాదవ్, శ్రీనివాసులు రెడ్డి, డా.యం.ఉమేష్ రావు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఫుట్బాల్ టీంకు అభినందన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ డిస్టిక్ (స్టేట్ మీట్) ఫుట్బాల్ టోర్నమెంట్ లో నాలుగో స్థానం సాధించిన తిరుపతి జిల్లా టీంను ఘనంగా అభినందించారు. స్థానిక క్యాంపస్ స్కూల్ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి తిరుపతి జిల్లా డిఎస్డిఓ, చీఫ్ కోర్ట్ షేక్ సయ్యద్ సాహెబ్, తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వై ప్రవీణ్ ముఖ్య అతిథులుగా వచ్చి తిరుపతి జిల్లా బాలుర జట్టుని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫుట్బాల్ అసోసియేషన్ సీనియర్ మెంబర్లైన చంద్రారెడ్డి, మునయ్య పాల్గొన్నారు.

పింఛన్..ఆనందం పంచెన్ : ఎంఎల్ఎ

పిచ్చాటూరు: పడిగాపులు.. ఎదురుచూపుల బాధ పోయిందని, పొలంలో ఉన్నా.. పనుల్లో ఉన్నా.. అవసరాల నిమిత్తం సుదూర ప్రాంతాలకు వెళ్లినా.. ఆందోళనపడాల్సిన అవసరం లేకుండా. ఎక్కడ ఉన్నా అక్కడకు వలంటీర్ ద్వారా పింఛన్నూ సీఎం జగన్ ఏలుబడిలోని తమ ప్రభుత్వం చేరుస్తుందని, ప్రభుత్వ ఉద్యోగి అందుకునే జీతం లాగా ఒకటో తేదీనే ఠంచన్గా అవ్వాతాతలు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, మత్స్యకార, చర్మకార, కల్లుగీత కార్మికులకు వైఎస్సార్ పెన్షన్ కానుక అందుతుందని తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం నారాయణవనం, పిచ్చాటురు, నాగలపురం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయాల్లో నూతనంగా ఫెన్షన్ పంపిణి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నారాయణవనంలో 125, పిచ్చాటురులో 128 నాగలపురంలో 123 మంది అర్హులకు మంజూరు ధవీకరణ పత్రాలు, ఫించన్ సొమ్మును పంపిణి చేశారు.



ట్యాబ్ల వినియోగంతో నాణ్యమైన విద్య

ప్రజాశక్తి - రేణిగుంట

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్ ల వినియోగం వలన విద్యార్థులకు నాణ్యమైన విద్య సమకూరుతు విద్యా ప్రమాణాలు పెంపొందుతున్నాయని అన్నమయ్య జిల్లా బైజూస్ నోడల్ ఆఫీసర్ సురేష్ తెలిపారు. శుక్రవారం రేణిగుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు)లో ఉపాధ్యాయులకు ట్యాబ్ల వినియోగంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్యాబ్ లో ఇచ్చిన కంటెంట్ తప్ప ఇంటర్నెట్ కంటెంట్ ను అప్లోడ్ చేసేందుకు, డౌన్లోడ్ చేసేందుకు. అవకాశం లేకుండా ట్యాబ్ ల సాఫ్ట్ వేర్ ను రూపొందించడం జరిగిందన్నారు. సరైన అవగాహన లేకపోవడం వల్ల కొందరు విద్యార్థులు యాప్స్ లను డౌన్లోడ్ చేసేందుకు ప్రయత్నించడంతో కొన్ని ట్యాబ్ లలో సాంకేతికంగా ఇబ్బందులు తలెత్తి పని చేయలేదన్నారు. ఎక్కడ తప్పు జరిగింది విద్యార్థులు గుర్తించలేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఇప్పుడు అన్ని ట్యాబ్ లలో గూగుల్ అథంటికేటర్ సాఫ్ట్వేర్ ను అప్లోడ్ చేస్తున్నామన్నారు. దీని తర్వాత విద్యార్థి తమ దగ్గర ఉన్న ట్యాబ్ లలో మార్పులు చేసేందుకు ప్రయత్నిస్తే వెంటనే సంబంధిత స్కూల్ ప్రధానోపాధ్యాయులకు, రాష్ట్రస్థాయిలోని కమాండ్ కంట్రోల్ సిబ్బందికి, మండల స్థాయిలో ఐటి సహాయకులుగా పనిచేసే ఉపాధ్యాయులకు సమాచారం వెళ్ళు తుందన్నారు. దీంతో ఏ పాఠశాలలో, ఏ విద్యార్థి తప్పు చేసారో సులభంగా తెలిసిపోతుందన్నారు. ట్యాబ్ లలో ఏవైనా మరమ్మతులు అవసరమైతే సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ కు ఇవ్వాలన్నారు. వాటిని వారు ఉచితంగా మరమ్మతులు చేసి తిరిగి ఇస్తారన్నారు. అనంతరం విద్యార్థులతో వారు ముఖాముఖి మాట్లాడారు. ట్యాబ్ ల వినియోగంపై విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివత్తి చేశారు. ప్రభుత్వం అందించిన ట్యాబ్ లను సక్రమంగా ఉపయోగించుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధని, జిల్లా బైజుస్ నోడల్ అధికారి సురేష్ మండలంలోని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో పాలక మండలి సభ్యుల నియామకం

ప్రజాశక్తి - క్యాంపస్ :

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పాలకమండలి నూతన సభ్యులుగా గురువారం రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పాలక మండలి సభ్యులు ఎస్వీయూలో ఇంగ్లీష్ విభాగానికి చెందిన సీనియర్ ఆచార్యులు డాక్టర్ సుమ కిరణ్, హెూం సైన్ విభాగానికి చెందిన ఆచార్య కోలా మంజుల, ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన విభాగంలో సీకాం విద్యా సంస్థల అధినేత డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి, గవర్నమెంట్ ప్రభుత్వ కాలేజీలకు సంబంధించిన పాలక మండలి సభ్యులుగా శ్రీకాళహస్తికి చెందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగానికి చెందిన డాక్టర్ సంధ్యారాణి, పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అత్తర్ మహమ్మదీన్ భాష, కళాశాల ప్రిన్సిపల్ కోటాలో ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి. పద్మనాభం, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ భూమన సుగుణ రెడ్డి, సామాజిక రంగానికి చెందిన వి.జ్యోతి, పుత్తూరు కి చెందిన వేదవ్యాస ట్రస్ట్ కు చెందిన నారాయణ బాబు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్వీయు ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఓఎండి హుస్సేన్ నూతన పాలకమండలి సభ్యులకు అభినందనలు తెలిపారు.



ఎస్వీయూ పాలక మండలి సభ్యులుగా డాక్టర్ మొహిద్దిన్ బాష

పాకాల: తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులుగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు మోహిద్దీన్ భాష నియమితులయ్యారు. పాలకమండలి సభ్యులుగా నియమితులైన సందర్భంగా శుక్రవారం కళాశాల అధ్యాపకులు కళాశాల ప్రధానాచార్యులు మొహిద్దిన్ భాషాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ వి వర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కోటాలో ఆయనను పాలకమండలి సభ్యులుగా నియమించడం ఆనందదాయకమని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర, అధ్యాపకులు రమేష్ కుమార్, రమణమ్మ, ఈశ్వర బాబు పాల్గొన్నారు

అంగన్ వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి -తొట్టబేడు

శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో శాంతిదుర్గ తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి ఈ ఏడాది జూలై 1నాటికి 21 సంవత్సరాలు నిండి... 35ఏళ్ల లోపు గల వారు దరఖాస్తుకు అర్హులని ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గల ఈ నెల 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని శాంతిదుర్గ కోరారు. శ్రీకాళహస్తిలో రెండు అంగన్ వాడీ, ఒకటి మినీ అంగన్ వాడీ, ఎనిమిది సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. అర్హులై ఆసక్తి గల వారు ఈ అవకాశం వినియోగించుకోవాలని శాంతిదుర్గ కోరారు.

జె. వెంకట లక్ష్మీకి డాక్టరేట్ ప్రదానం




క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం అప్లైడ్ మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ విభాగం విద్యార్థిని జె. వెంకట లక్ష్మీ కి వర్సిటీ పరీక్షల నియంత్రణ కార్యాలయం డాక్టరేట్ ప్రదానం చేశారు. అప్లైడ్ మైక్రోబయాలజీ ఆచార్యులు డాక్టర్ సిహెచ్ ఎమ్. కుమారి చిట్టూరి, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ తిరుపతి బయోకెమిస్ట్రీ విభాగం ఆచార్యులు డాక్టర్ సిహెచ్. అప్పార్లావు ల మార్గదర్శకత్వంలో "ఎవాల్యువేషన్ ఆఫ్ యాంటీ డయాబెటిక్ యాక్టివిటీ ఆఫ్ కామదేను ఆర్క్ ఇన్ కాంబినేషన్ విత్ హెర్బల్ ఎక్స్ట్రాక్స్" అను అంశం పై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు.

కంప్యూటర్ సైన్స్లో శారదకు పీహెచ్డీ ప్రదానం



క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయము కంప్యూటర్ సైన్స్ విభాగమున పరిశోధన విద్యార్థిని జే. శారదకు డాక్టరేట్ ప్రదానం చేశారు. కంప్యూటర్స్ సైన్స్ విభాగ సహాయ ఆచార్యులు ఎన్ వి. ముత్తులక్ష్మి మార్గదర్శకత్యంలో ఎఫిసియంట్ ప్రిడిక్టివ్ మోడల్స్ యూసింగ్ బిగ్ డేటా టు డిటెక్ట్ క్రోనిక్ కిడ్నీ డిసీజ్ విత్ డిప్ లార్నింగ్ టెక్నిక్స్" అంశంపై పరిశోధన గ్రంధాన్ని వర్సిటీ కి సమర్పించినందుకు ఆమెకు డాక్టరేట్ లభించిందని యూనివర్శిటీ డీన్ అప్ ఎగ్జామినేషన్స్ ఆచార్య జీవనజ్యోతి తెలిపారు.

ఆచార్య ఎస్డిఎస్ మూర్తికి ఫెలో ఆఫ్ఐఎస్ఏబి అవార్డు



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ బయో కెమిస్ట్రీ విభాగపు సీనియర్ ఆచార్యులు ప్రొఫెసర్ ఎస్డిఎస్ మూర్తికి ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రికల్చర్ బయో కెమిస్ట్రీ వారిచే ఫెలో అవార్డుకు ఎంపిక అయ్యారు. ఈ అవార్డును నవంబర్ 23 నుంచి 25 వరకు జరిగే అంతర్జాతీయ సదస్సులో ప్రొఫెసర్ మూర్తి అందుకోనున్నారు. ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన ప్రొఫెసర్ మూర్తిని వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఒఎమ్డి హుస్సేన్లు అభినందించారు.

అంగన్వాడి సెంటర్లకు వాటర్ క్యాన్లు పంపిణీ

కోట : మండల కేంద్రమైన కోటకు సంబంధించిన అంగన్వాడి సెక్టర్ లోని కోట,వాకాడు, చిట్టమూరు మండలాల లోని 225 అంగన్వాడీ కేంద్రాలకు శుక్రవారం కోట సెక్టార్ కార్యాలయంలో అంగన్వాడీ సీడీపీఓ మునికుమారి ఆధ్వర్యంలో అంగన్వాడి హెల్పర్లకు ప్రతి సెంటర్కు ఒక వాటర్ క్యాన్,క్లీనింగ్ బ్రష్, ఫినాయిల్ బాటిల్ సూపర్వైజర్ల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్ లు కవిత, శేషమ్మ,పద్మమ్మ,అంగన్వాడి వర్కర్లు ఉన్నారు.

రాబోయేది జనసేన ప్రభుత్వమే

గూడూరు రూరల్ : సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్ర శేఖర్ ధీమా వ్యక్తం చేసారు. సెప్టెంబర్ 2 తేదీన జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు పురస్కరించుకొని ప్రకటించిన సేవా కార్యక్రమాల్లో భాగంగా తిరుపతి జిల్లా మండల పరిధిలోని ఏరూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఇంద్రవర్ధన్, వంశీ, ప్రభాకర్ పాల్గొన్నారు.

సీతారాములు సేవలో కలవగుంట భరత్ రెడ్డి

తొట్టంబేడు : పూడి దళితవాడలో నిర్వహిస్తున్న సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి చిత్రపీఠ ప్రతిష్ట కార్యక్రమంలో జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్రెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, పూడి గ్రామ ప్రజలు కలవగుంట భరత్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. కలవగుంట భరత్ రెడ్డి ఆలయానికి రూ.10వేలు విలువ చేసే బీరువాను అందజేశారు.



మాతమ్మకు సారె సమర్పించిన మోహిత్ రెడ్డి

తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని కొత్త మంగళం పంచాయతీ పరిధిలోని మిట్టగాంధీపురంలో వెలసిన మాతమ్మ కొలుపు సందర్భంగా శుక్రవారం తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాతమ్మకు ఊరేగింపుగా సారెను తీసుకువచ్చి కొలుపు నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఘనంగా సత్కరించి ఆలయ మర్యాదలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మంగళం డివిజన్ అధ్యక్షులు ప్రళయకావేరి నారాయణరెడ్డి, తిరుమలనగర్ పంచాయతీ ఇన్ చార్జి గుండ్రాజు శివశంకర్ రాజు, మంగళం పంచాయతీ అధ్యక్షులు చిలమంద హరికష్ణ పాల్గొన్నారు.

కార్పొరేషన్ వెటర్నరీ అధికారిగా డాక్టర్ నాగేంద్ర రెడ్డి



తిరుపతి టౌన్ : తిరుపతి నగరపాలక సంస్థ వెటర్నరీ ఆఫీసర్గా డాక్టర్ నాగేంద్ర రెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం కమిషనర్ హరితను కలిసి పుష్ప గుచ్ఛం అందించి బాధ్యతలు చేపట్టారు.



సిసి రోడ్లు నాణ్యతగా ఉండాలి : ఆర్డీవో

గూడూరు : ప్రభుత్వం నుండి వచ్చిన నిధుల ద్వారా గూడూరు పట్టణంలో 100 అభివద్ధి పనులు గత నెల రోజుల్లో ప్రారంభమై వేగవంతంగా జరుగుతున్నాయని నాణ్యతలో ఎక్కడా రాజీ లేకుండా నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలో పలు వార్డుల్లో జరుగుతున్న సిమెంట్ రోడ్డు, కాలువల నిర్మాణ పనులను ఆర్డిఓ కిరణ్ కుమార్ పరిశీలించారు నాణ్యతలో ఎక్కడా రాజీ లేకుండా చూడాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు ఆర్డీవో కిరణ్ కుమార్ మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తర్వాత ప్రభుత్వం ఒక్కొక్క సచివాలయానికి 20 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసిందని తెలిపారు ఈ నిధుల ద్వారా గత నెల రోజుల్లో పలు వార్డుల్లో 100 పనులు ప్రారంభించామని ఇప్పటికే పలు అభివద్ధి పనులు పూర్తయ్యాయని తెలిపారు 32 వర్కులు పెండింగ్లో ఉన్నాయని అవి కూడా త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తామని వెల్లడించారు.

వీధిలైట్లు వెలగక 'చీకట్లు'

గూడూరు : మున్సిపాలిటీ పరిధిలో వార్డుల్లో సక్రమంగా వీధిలైట్ల పర్యవేక్షణ లేకపోవడం వలన సాయంత్రం వేళల్లో వార్డు అంధకారంలోకి వెళ్తున్నాయి. ఇదే అదునుగా చైన్ స్నాచర్లకు, పిల్లల దొంగతనాలు, ఇళ్ళల్లో దొంగతనాలు చేసే వారికి అవకాశం ఉంటుంది. గూడూరు పరిసర ప్రాంతాలైన నాయుడుపేట, సూళ్లూరుపేట ప్రాంతాల్లో ఇటీవల తరచూ దొంగతనాలు జరిగాయి. మున్సిపల్ అధికారులు చొరవ చూపి వీధిలైట్లు సక్రమంగా వేసి వెలిగేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఓనం పండుగ ఐక్యతకు స్ఫూర్తి



రేణిగుంట : ఓనం పండుగ ఐక్యతకు స్ఫూర్తిని స్తుందని యూనివర్సిటీ ప్రిన్సిపాల్ తిరులోగ్ చందర్ స్పష్టం చేశారు. శుక్రవారం రేణిగుంట మండలంలోని కుర్రకాల్వ సమీపంలో గల కలినరి యూనివర్సిటీ నందు ఓనం పండుగ మహోత్సవములను భారతీయ పాకశాల సంస్థ పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణంలో విస్తారమైన పూల రంగోలి గీసి కుతువిలకు (దీపం) రాజైన మహాబలిని ఆవిష్కరించడానికి వెలిగించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ తిరులోగ్ చందర్ మాట్లాడుతూ ఈ పండుగ ఐక్యత స్ఫూర్తిని సూచిస్తుందన్నారు. ముఖ్య అతిథిగా తిరుపతి గ్రాండ్ రిడ్జ్ హెూటల్ జనరల్ మేనేజర్ సూరజ్, రేణిగుంట మలయాళీ అసోసియేషన్ మెంబర్ జాషువా పాల్గొన్నారు. కలినరీ ఆర్ట్స్ బీబీఏ, బీఎస్సీ, ఎంబీఏలకు అడ్మిషన్లు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇంటర్మీడియట్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులైన అడ్మిషన్ వివరాల కోసం లెక్చరర్ చెల్లేశ్వర రావు 9985486271 నంబర్లను సంప్రదించాలని కోరారు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి -ఏర్పేడు

ఏర్పేడు మండలం కందాడ దళితవాడకు చెందిన పారి అశోక్(30) బుధవారం రాత్రి కంచనపల్లి దళితవాడలో సమీప బంధువుల వివాహ మహోత్సవానికి వెళ్లి బుధవారం రాత్రి తిరిగి వస్తుండగా బత్తినయ్య కాలనీ రామాపురం మధ్యలో బైక్ తో పాటు కింద పడిపోయాడు. రాత్రిపూట తొమ్మిది గంటల పై ఆ మార్గంలో వెళ్లే వాహన చోదకులు గుర్తించారు. ఆ సమయంలో అశోక్ ఫోను రింగ్ అవడంతో రోడ్డుపై అశోక్ పడి ఉన్నట్లు వారి బంధువులకు గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం అందించారు. దీంతో అతని బంధువులు వైద్యం కోసం రేణిగుంట సమీపంలో ఉన్న బాలాజీ ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి వైద్యం కోసం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం వేలూరు సిఎంసి కి తరలించగా అక్కడ వైద్యుల సలహా మేరకు రాణి పేటకు తరలించాలని సూచించారు అయితే అక్కడ కూడా పరిస్థితి లాభం లేదని స్విమ్స్ కు తీసుకెళ్లాలని సూచించడంతో తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ అశోక్ మతి చెందాడు. మతుని బంధువులు ఫిర్యాదు మేరకు ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేశారు. మత దేహాన్ని పోస్టుమార్టం కొరకు శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మతుడు రేణిగుంట సమీపంలోని ఓ ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తున్నారు నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పట్టపగలు ఖాదర్బాషా హత్య



వాకాడు : బీసీ కాలనీ మల్లెపూల సెంటర్లో ఖాదర్బాషా హత్యకు గురయ్యాడు. సెంటర్లో బావ బావమరుదులు షేక్ ఖాదర్బాషా, షేక్ కరీముల్లా స్వల్పంగా తగువుపడ్డారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో షేక్ ఖాదర్బాషా (48) అక్కడికక్కడే మృతిచెందాడు.క్షణికావేశంలో జరిగిన ఈ దాడి ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రఘు మాధవ్ కరీముల్లాను అదుపులోకి తీసుకున్నారు. క్షణికావేశం రెండు కుటుంబాలను అంధకారంలోకి నెట్టేసిందని బంధువులు వాపోయారు. ఇరువురూ బంధువులే కావడంతో వారి కుటుంబాల్లో విషాదం అలముకుంది.